# ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు.. అతి కొద్దిమంది నేతల్లో మోదీ ఒకరు!

మొదటిపేజీ తరువాయి – ప్రస్థానంలో ఒక అరుదైన మైలురాయిని చేరుకున్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా 2001 అక్టోబర్ 7న బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటి వరకు, ప్రధానమంత్రిగా కొనసాగుతూ.. ప్రభుత్వ అధినేతగా నిరంతరాయంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. పాతికేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం నిరంతరాయంగా అధికారంలో కొనసాగిన అతికొద్ది మంది ప్రపంచ నేతల జాబితాలో ఆయన స్థానం సంపాదించారు. భారతదేశంలో, ఎన్నికైన ప్రభుత్వానికి అధిపతిగా సుదీర్ఘకాలం పనిచేసిన రికార్డును మోదీ ఇప్పటికే అధిగమించారు. గతంలో ఈ రికార్డు సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉండేది. సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్ నేత అయిన చామ్లింగ్ డిసెంబర్ 1994 నుంచి మే 2019 వరకు మొత్తం 24 సంవత్సరాల 165 రోజుల పాటు సీఎంగా పనిచేశారు. దేశంలో సుదీర్ఘకాలం ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారిలో ఒడిశాకు చెందిన నవీన్ పట్నాయక్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన జ్యోతిబసు కూడా ఉన్నారు. బిజూ జనతాదళ్ నాయకుడు నవీన్ పట్నాయక్ మార్చి 2000 నుంచి జూన్ 2024 వరకు 24 సంవత్సరాల 99 రోజుల పాటు సీఎంగా సేవలందించారు. ఆయన తన స్వచ్ఛమైన ఇమేజ్, విపత్తు నిర్వహణ సామర్థ్యం, మహిళా సాధికారత కార్యక్రమాలతో ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారు. ఇక, సీపీఎం నేత జ్యోతిబసు జూన్ 1977 నుంచి నవంబర్ 2000 వరకు 23 సంవత్సరాల 137 రోజుల పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన హయాంలో అమలు చేసిన భూ సంస్కరణలు, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. అంతర్జాతీయంగా చూస్తే, సింగపూర్ తొలి ప్రధాని లీ క్వాన్ యూ 1959 నుంచి 1990 వరకు ఏకంగా 31 ఏళ్లు నిరంతరాయంగా అధికారంలో ఉన్నారు. ప్రజాస్వామ్య దేశాల్లో సుదీర్ఘ పాలనకు ఆయనను ఒక ఆధునిక కొలమానంగా పరిగణిస్తారు. ఆయన నాయకత్వంలో సింగపూర్ పేదరికం నుంచి ప్రపంచంలోని అత్యంత సంపన్న దేశాల్లో ఒకటిగా ఎదిగింది. కంబోడియాలో హున్ సేన్ 1985 నుంచి 2023 వరకు ప్రధానిగా పనిచేసి, ఆధునిక ప్రపంచంలో ఎక్కువ కాలం పనిచేసిన నేతల్లో ఒకరిగా నిలిచారు. మలేషియాలో మహతీర్ మొహమ్మద్ రెండు పర్యాయాల్లో కలిపి 24 ఏళ్లకు పైగా ప్రధానిగా పనిచేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత పోటీతత్వ ప్రజాస్వామ్యంలో వరుస ఎన్నికల విజయాలతో ఈ 25 ఏళ్ల మైలురాయిని చేరుకోవడం మోదీ విషయంలో ఒక ప్రత్యేకతగా నిలుస్తోంది. "వికసిత భారత్" లక్ష్యంతో ఆయన ప్రస్థానం ఇంకా కొనసాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న అనేక మంది నేతలు వివాదాస్పద పాలకులుగా ముద్రపడగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికవుతూ మోదీ ఈ ఘనత సాధించడం గమనార్హం.

## ఎర్రవల్లి భూములపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

మొదటిపేజీ తరువాయి – నంబర్ 325లో రెవెన్యూ రికార్డుల ప్రకారం 388 ఎకరాలు ఉండగా, క్షేత్రస్థాయి సర్వేలో కేవలం 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. దీంతో గల్లంతైన 45 ఎకరాల భూమి ఎక్కడుందో వెంటనే గుర్తించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ భూమిని గుర్తించేందుకు ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాలకు సర్వే నోటిఫికేషన్లు జారీ చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా, సంబంధిత రెవెన్యూ రికార్డులను సమర్పించాలంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి నోటీసులు ఇవ్వాలని స్పష్టం చేశారు. సర్వే నంబర్ 325లోని భూమిని అమరవీరుల కుటుంబాల కోసం కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. అక్కడ 'అమరవీరుల కాలనీ' నిర్మించి, వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని సూచించారు. ఈ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ బోర్డుకు అప్పగిస్తూ, జూన్ 2వ తేదీ నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు. మాజీ సీఎం కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసరాల్లోని ప్రభుత్వ, అసైన్డ్ భూములపై సమగ్ర విచారణ జరపాలని గతంలో అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ ఆదేశాల మేరకే రెవెన్యూ అధికారులు ఇటీవలి వారాల్లో ఈ ప్రాంతంలో సర్వే నిర్వహించి, నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.

## చర్చలకు సిద్ధంగా లేమని తేల్చి చెప్పిన కిమ్ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి – అత్యంత శక్తిమంతంగా ప్రతిఘటిస్తామని ఉత్తర కొరియా మంగళవారం దక్షిణ కొరియాను తీవ్రంగా హెచ్చరించింది. సరిహద్దులో ఇటీవల జరిగిన ల్యాండ్‌మైన్ పేలుడు ఘటనపై దక్షిణ కొరియా తీసుకుంటున్న చర్యల నేపథ్యంలో ఈ హెచ్చరికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సెప్టెంబర్ 21న ఇరు దేశాల సరిహద్దులోని సైనిక రహిత ప్రాంతం (డిఎంజెడ్) దక్షిణ భాగంలో జరిగిన ల్యాండ్‌మైన్ పేలుడులో ఇద్దరు దక్షిణ కొరియా సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ పేలుళ్లకు ఉత్తర కొరియానే కారణమని, వారు ఉద్దేశపూర్వకంగానే మైన్‌లను అమర్చారని దక్షిణ కొరియా సైన్యం దర్యాప్తులో పేర్కొంది. దీనికి ప్రతిస్పందనగా, ఐక్యరాజ్యసమితి కమాండ్ (ఖచీజ) సహకారంతో దక్షిణ కొరియా ఆ ప్రాంతంలో మైన్‌లను తొలగించే ఆపరేషన్‌ను చేపట్టింది. దీన్ని ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాత్మక చర్యగా దక్షిణ కొరియా రక్షణ మంత్రి కాంగ్ షిన్-చుల్ అభివర్ణించారు. ఈ పరిణామాలపై ఉత్తర కొరియా విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. ల్యాండ్‌మైన్ పేలుడుతో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఆ మేరకు ఆరోపణలను పూర్తిగా ఖండించింది. దక్షిణ కొరియా ఉద్దేశపూర్వకంగా కట్టుకథ అల్లి, తమపై నిందలు వేస్తోందని, అంతర్జాతీయంగా తమ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించింది. "ఒకవేళ దక్షిణ కొరియా సైనికులు సరిహద్దు రేఖను దాటి మా భూభాగంలోకి ప్రవేశిస్తే, మా సరిహద్దు దళాలు తక్షణమే శక్తిమంతమైన ప్రతిచర్య తీసుకుంటాయి" అని ఆ ప్రకటనలో హెచ్చరించింది. ఈ వివాదానికి ప్రధాన కారణం సరిహద్దు రేఖ (వీఙా)పై స్పష్టత లేకపోవడమేనని వాదనలు వినిపిస్తున్నాయి. 1953 యుద్ధ విరమణ ఒప్పందం సమయంలో ఏర్పాటు చేసిన 1,292 సరిహద్దు గుర్తింపు చిహ్నాలలో చాలా వరకు కాలక్రమేణా దెబ్బతినడంతో, ప్రస్తుతం కేవలం 200 మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ నేపథ్యంలో సరిహద్దు రేఖపై నెలకొన్న అనిశ్చితిని పరిష్కరించడానికి చర్చలు జరపాలని దక్షిణ కొరియా ప్రతిపాదించినప్పటికీ, అందుకు తాము సిద్ధంగా లేమని ఉత్తర కొరియా స్పష్టం చేసింది. తమ సార్వభౌమాధికారానికి సంబంధించిన విషయాల్లో చర్చలకు తావులేదని, బల ప్రయోగంతోనే తమ భూభాగాన్ని కాపాడుకుంటామని తేల్చి చెప్పింది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

## పోలీసుల అదుపులో రాహుల్ గాంధీ, ప్రియాంక



మొదటిపేజీ తరువాయి – రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం 'నిర్వాచన్ సదన్' వైపు నిరసన ర్యాలీగా బయలుదేరారు. అయితే, ఆకాశవాణి భవన్ సమీపంలో పోలీసులు భారీ బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, నేతలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో రాహుల్ గాంధీ బారికేడ్లు ఎక్కి, చేతిలో జాతీయ జెండాను ప్రదర్శిస్తూ తన నిరసనను తీవ్రతరం చేశారు. అనంతరం ఇతర నేతలతో కలిసి రోడ్డుపైనే బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఢిల్లీ పోలీసులు రంగప్రవేశం చేసి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, టీఎంసీ, శివసేన (యూబీటీ) సహా పలువురు విపక్ష ఎంపీలను అదుపులోకి తీసుకుని బస్సుల్లోకి ఎక్కించారు. ఓటర్ల జాబితాల సవరణలో పారదర్శకత లోపించిందని, అవకతవకలు జరుగుతున్నాయని విపక్షాలు గత కొద్ది వారాలుగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నాయి. ఈసీలో అంతర్గత విభేదాలు ఉన్నాయని కూడా వార్తలు వచ్చాయి. దీనిపై రాహుల్ సోషల్ మీడియాలోనూ స్పందించారు. "జ్ఞానేశ్, ఇక ముగిసింది. రాజీనామా చేయాల్సిన సమయం వచ్చింది" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

# గృహ వినియోగదారులకు 24 గంటలూ నిరంతర విద్యుత్

మొదటిపేజీ తరువాయి – లేకుండా నిరంతర సరఫరా అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పులిచింతల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి డిప్యూటీ సీఎం పరిశీలించారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, ఇప్పటివరకు జరిగిన ఉత్పత్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. యూనిట్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి, అధికారులు ఏర్పాటు చేసిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఇదే సమయంలో రాష్ట్రంలో పీక్ విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్లు ఉండగా, ప్రస్తుతం దాదాపు 20 వేల మెగావాట్లకు చేరిందని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల కారణంగా నదులు, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గి, జలవిద్యుత్ ఉత్పత్తి సుమారు 4 వేల మెగావాట్లు తగ్గిందన్నారు. డిమాండ్ పెరుగుదల, జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గుదల కలిపి సుమారు 8 వేల మెగావాట్ల అదనపు భారం ఏర్పడినప్పటికీ విద్యుత్ సంస్థలు సమర్థంగా పనిచేస్తూ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తున్నాయని వివరించారు.

### జలవిద్యుత్ కేంద్రాలన్నీ ఉత్పత్తికి సిద్ధం

రాష్ట్రంలోని అన్ని జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో యంత్రాలు, యూనిట్లు పూర్తిస్థాయి సామర్థ్యంతో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అవసరమైన స్థాయిలో నీటి లభ్యత



లేకపోవడం వల్లే జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గిందని స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులు, ఎండల తీవ్రత ఇందుకు ప్రధాన కారణాలన్నారు. "ఎన్ని సవాళ్లు ఎదురైనా గృహ వినియోగదారులకు 24 గంటలూ విద్యుత్ సరఫరా చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి ఉన్నాం. ప్రజలు విద్యుత్ సరఫరాపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అని డిప్యూటీ సీఎం తెలిపారు. రాత్రి వేళల్లో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా అధిగమిస్తున్నామని చెప్పారు. కర్ణాటకలో పీక్ విద్యుత్ డిమాండ్ సుమారు 20 వేల మెగావాట్లు ఉండగా తెలంగాణలోనూ ప్రస్తుతం అదే స్థాయికి చేరిందని, ఆంధ్రప్రదేశ్‌లో పీక్ డిమాండ్ సుమారు 12 వేల మెగావాట్లుగా ఉందని పేర్కొన్నారు.

### నీటిని పొదుపుగా వినియోగించాలి

రాబోయే రోజుల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోతే నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. తదుపరి వర్షాకాలం వరకు అందుబాటులో ఉన్న నీటిని మనుషులు, పశువులు, పక్షుల తాగునీటి అవసరాలకు జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిన పరిస్థితుల్లోనూ నిరంతర విద్యుత్ సరఫరా కోసం శ్రమిస్తున్న జెన్‌కోతో పాటు విద్యుత్ సంస్థల సిబ్బందిని డిప్యూటీ సీఎం అభినందించారు.

### 27 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయాన్నే టిఫిన్ అందించే పథకానికి సంబంధించిన సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. అలాగే రాష్ట్రంలోని 105 నియోజకవర్గాల్లో ఒక్కో పాఠశాలకు రూ.200 కోట్ల చొప్పున కేటాయించి, అత్యాధునిక సదుపాయాలతో పాఠశాలలను నిర్మిస్తున్నామని చెప్పారు. ఒకే ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన సుమారు 2,600 మంది విద్యార్థులు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనభ్యసించేలా ఈ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని వివరించారు.

# ఓటును కాపాడండి.. దేశాన్ని కాపాడండి



మొదటిపేజీ తరువాయి – ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకొని పెద్ద సంఖ్యలో ప్రజల ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రజల ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది అత్యంత విలువైన హక్కు అని, ఓటు హక్కును కాపాడుకోవడం అంటే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమేనని మంత్రి అన్నారు. ఎన్నికల జాబితాల్లో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా పారదర్శకమైన ప్రక్రియ ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల మార్పులు, తొలగింపుల విషయంలో ప్రజలకు పూర్తి స్పష్టత ఉండాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ నాయకులు పొద్దున లేవగానే దేవుడి పేరు చెప్పడం, మతాల పేరుతో రాజకీయాలు చేయడం తప్ప ప్రజల సమస్యలపై దృష్టి పెట్టడం లేదని మంత్రి విమర్శించారు. మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించే రాజకీయాలకు స్వస్తి పలకాలని అన్నారు. దేశ ప్రజలందరినీ కలుపుకొని ముందుకు తీసుకెళ్లే రాజకీయాలు అవసరమని పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజల ఓటు హక్కును ఎవరైనా ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తే ప్రజలు ప్రశ్నించాలని అన్నారు. యువత, విద్యార్థులు, ప్రజాసంఘాలు ప్రజాస్వామ్య పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే నిర్ణేతలని, ప్రజల ఓటుతోనే ప్రభుత్వాలు ఏర్పడతాయని మంత్రి తెలిపారు. "ఓటును కాపాడండి.. దేశాన్ని కాపాడండి" అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అన్నారు. ప్రజల హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఇండియా కూటమి ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కార్యక్రమాలను కొనసాగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మిత్రపక్షాల నాయకులు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువజన నాయకులు, మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# 27 లక్షల మంది విద్యార్థులకు వేడివేడి అల్పాహారం

మొదటిపేజీ తరువాయి – రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ వేడివేడి అల్పాహారం అందించే కార్యక్రమం ప్రపంచంలో మరెక్కడా లేదని, తెలంగాణలోనే ఈ వినూత్న కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని ఉచితంగా కాకుండా రాష్ట్ర భవిష్యత్తు మానవ వనరులపై చేస్తున్న పెట్టుబడిగా చూడాలని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గంలోని మునగాల గ్రామంలో పాఠశాల విద్యార్థుల కోసం రూ.9.6 కోట్లతో నిర్మించనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు.

### 1,020 పాఠశాలలు.. 60 వేల మంది విద్యార్థులు

మునగాలలో నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ద్వారా 1,020 పాఠశాలల్లో చదువుతున్న దాదాపు 60 వేల మంది విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేడివేడి అల్పాహారం అందించనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని 27 లక్షల మంది విద్యార్థులకు వారానికి ఆరు రోజులపాటు అల్పాహారం అందిస్తున్నామని చెప్పారు. మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగిజావ అందిస్తున్నట్లు తెలిపారు. ఎదిగే వయసులో పిల్లలకు అవసరమైన పౌష్టికాహారం అందిస్తేనే వారు ఆరోగ్యవంతమైన మానవ వనరులుగా ఎదుగుతారని అన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండి, నాణ్యమైన విద్యను అభ్యసిస్తే భవిష్యత్తులో రాష్ట్ర ఉత్పాదకత పెరిగి జీఎస్‌డీపీ వృద్ధికి దోహదం చేస్తారని పేర్కొన్నారు.

### సంక్షేమం ఉచితం కాదు.. పెట్టుబడే

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఉచితాలుగా చూడటంజూ సరికాదని డిప్యూటీ సీఎం అన్నారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల కోసం ప్రభుత్వం చేస్తున్న ఖర్చు అంతిమంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే పెట్టుబడేనని పేర్కొన్నారు. రైతు భరోసా, ఉచిత విద్యుత్, సన్నబియ్యం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, వడ్డీలేని రుణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు వంటి కార్యక్రమాల లక్ష్యం పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమేనన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండటం, పిల్లలు చదువుకోవడం, మహిళలు ఆర్థికంగా ఎదగడం, రైతులకు పెట్టుబడి సాయం అందడం ద్వారా ఉత్పాదకత పెరుగుతుందని చెప్పారు. ప్రజల కొనుగోలు శక్తి పెరిగితే ఆర్థిక కార్యకలాపాలు పెరిగి రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధికి దోహదపడతాయని వివరించారు.

### బీఆర్ఎస్‌కు గతమే.. భవిష్యత్తు లేదు

బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తామని చేస్తున్న ప్రకటనలపై స్పందించిన భట్టి విక్రమార్క.. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు అవసరమైన సంక్షేమ కార్యక్రమాలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. "ఇందిరమ్మ ఇళ్లను ఆపడానికి వస్తారా? సన్నబియ్యం పంపిణీ నిలిపివేయడానికి వస్తారా? 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ఆపడానికి వస్తారా? మహిళలకు వడ్డీలేని రుణాలను నిలిపివేయడానికి వస్తారా? పేద విద్యార్థులకు అందుతున్న ఆర్థిక సాయాన్ని ఆపడానికి వస్తారా?" అని ప్రశ్నించారు. ప్రజలు అమాయకులు కాదని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గమనిస్తున్నారని పేర్కొంటూ "బీఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదు" అని వ్యాఖ్యానించారు.

### నవంబర్ 19న ఇందిరమ్మ కుటుంబ బీమా

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని తీసుకురానున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. నవంబర్ 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. కుటుంబ యజమానికి అనుకోని ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి రూ.5



లక్షల ఆర్థిక భద్రత కల్పించేలా పథకాన్ని రూపొందిస్తున్నట్లు వివరించారు.

### రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్

ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులంతా ఒకే ప్రాంగణంలో, ఒకే కుటుంబంలా చదువుకునేలా వీటిని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంగ్లిష్ మీడియం విద్యతో పాటు క్రీడలు, స్టేడియం తదితర అత్యాధునిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు.

### ప్రజలే మా కుటుంబం

కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంత ప్రజలే తమ కుటుంబమనే భావనతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పనిచేస్తున్నారని భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాప్రతినిధులు అధికారాన్ని ప్రదర్శించేందుకు కాకుండా ప్రజలు అప్పగించిన బాధ్యతను నెరవేర్చేందుకు పనిచేయాలని పేర్కొన్నారు. ఆ దిశగా ఉత్తమ్ దంపతులు ప్రజలకు సేవ చేస్తున్నారని అభినందించారు. మునగాల హెలిప్యాడ్ నుంచి సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ శంకుస్థాపన ప్రాంతం వరకు కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు సుమారు 500 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు స్వాగతం పలికారు.

# ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్ పూర్తి చేసి లబ్ధిదారుల చేతికి తాళాలిస్తాం

మొదటిపేజీ తరువాయి – మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వేగంగా పూర్తి చేసి ఏడాదిలోగా అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీనిలో భాగంగా ఏడాది గడువును కాంట్రాక్టర్లకు నిర్దేశించామని అయితే ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ.90 లక్షలు ప్రోత్సాహక బహుమతిగా ఇస్తామని చెప్పామని వివరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారంలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు సహచర మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద గౌడ్, పలువురు లబ్ధిదారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు 23 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇందిరమ్మ టవర్స్ ను నిరంతర ప్రక్రియగా నిర్మిస్తామని తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇళ్ల కోసం 7,000 మందికి పైగా దరఖాస్తులు అందగా, పరిశీలన అనంతరం 5,218 మంది అర్హులుగా తేలారని అర్హులైన వారిలో లబ్ధిదారుల ఎంపికను బహిరంగంగా లక్కీ డ్రా ద్వారా చేపట్టి, 480 మంది లబ్ధిదారులను తుది జాబితాలో ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపిక ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా నిర్వహించామని, ఎవరికి ఏ విధంగా ఇల్లు మంజూరైందనే




వివరాలను కూడా లబ్ధిదారులకు తెలియజేయడంతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను అందజేస్తామని చెప్పారు. ప్రస్తుతం కేటాయించిన ఇళ్లతో కార్యక్రమం ముగియదని, మరో మూడు విడతల్లోనూ ఇళ్ల నిర్మాణాన్ని చేపడతామని మంత్రి చెప్పారు. ప్రస్తుతం సుమారు 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, దీనితో పాటు నియోజకవర్గంలో ఉన్న ఇతర ప్రభుత్వ, హౌసింగ్ శాఖ భూములను గుర్తించి అక్కడ కూడా పేదలకు ఇళ్లు నిర్మించే చర్యలు చేపడతామని తెలిపారు. ఈ మేరకు హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే సూచనలు చేసినట్లు వెల్లడించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని మంత్రి అన్నారు. లబ్ధిదారులు కూడా తమ ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని



సూచించారు. మీ కళ్ల ముందే మీ ఇల్లు నిర్మించబడాలి నాణ్యతతో కూడిన ఇంటిని సొంతం చేసుకున్నామనే తృప్తి, ఆనందం మీకు కలగాలి అనేదే ఇందిరమ్మ ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. పేదల చిన్న చిన్న కోరికలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం ఆ దిశగా చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. పేదవాడి సొంతింటి కలను కేవలం హామీగా కాకుండా, కార్యరూపంలోకి తీసుకువస్తున్నామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు లబ్దిదారులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ సెక్రటరీ వి.పి.గౌతమ్, కలెక్టర్ మనూ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం వద్దు

రాజధాని పనులపై చంద్రబాబు సమీక్ష.. కీలక ఆదేశాలు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. రాజధాని ప్రాంతంలో ప్రతి నెలా కనీసం రూ. 2 వేల కోట్ల విలువైన పనులను పూర్తి చేయాలని ఆయన అధికారులకు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణతో పాటు వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గత నెలలో రాజధాని పరిధిలో రూ. 1,345 కోట్ల విలువైన పనులు పూర్తయినట్లు అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదించారు. నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా చేరుకోవాలంటే పనుల వేగాన్ని మరింత పెంచాలని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం అమరావతిలో 152 ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 41 వేల మంది కార్మికులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని మంత్రి నారాయణ వివరించారు. వివిధ నిర్మాణ సంస్థలు చేపట్టిన పనుల పురోగతిని సీఎం స్వయంగా ఆరా తీశారు. రాజధాని అభివృద్ధిలో కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రాజెక్టు పనులను త్వరితగతిన పట్టాలెక్కించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చోటుచేసుకోకూడదని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

# ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం

మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి..




**మహేశ్వరం, అక్టోబర్ 6, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** ఫ్యూచర్ సిటీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం మూడు కోట్ల 18 లక్షల 50 వేల రూపాయలతో తుక్కుగూడ,మంఖాల్ డివిజన్ పరిధిలోని సిసి రోడ్లు, బిటి రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయానికి ప్రతిరోజు వేలాది మంది భక్తులు పూజలకు వస్తుంటారని వారికి రోడ్డు సౌకర్యం లేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో మున్సిపల్ ఫండ్ ద్వారా రోడ్లు, డ్రైనేజీకి నిధులు మంజూరయ్యాయని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పనులు ఈ పోవడం జరిగిందని అన్నారు. నిలిచిన పనులను తిరిగి ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలి ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగిస్తున్నారని ఆమె మండిపడ్డారు. ప్రభుత్వం రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర సమస్యలపై దృష్టి సారించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీడీవో శారదమ్మ..



**మహేశ్వరం, అక్టోబర్ 6, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** ఉపాధి హామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శారదమ్మ తెలిపారు. మంగళవారం కల్వకోలు గ్రామంలో వి బి జి రామ్ జీ నిధులతో చేపడుతున్న ఉపాధి హామీ పనులను గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మతో కలిసి ఆమె పరిశీలించారు. ప్రభుత్వం చేపడుతున్న ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో ఎంపీడీవో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఓ పరిమళ, పంచాయతీ కార్యదర్శి వేణు, ఉపసర్పంచ్ జనార్ధన్ గౌడ్, వార్డు సభ్యులు మల్లేష్ నాయకులు బక్కని రవి, అనిల్ కుమార్, అశోక్, కృష్ణయ్య, నరసింహ పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

కలెక్టర్ హరిత....

ఆసుపత్రి ప్రాంగణంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం....



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. మంగళవారం ఆసుపత్రిని సందర్శించిన ఆమె, పలు వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు అందుతున్న తీరు, సమయానికి మందులు ఇస్తున్నారా లేదా, అల్పాహారం, భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు.గతంలో ఆసుపత్రిని సందర్శించినప్పుడు లిఫ్ట్ పనిచేయక రోగులు ఇబ్బంది పడుతున్న విషయం తన దృష్టికి రాగా, వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెచ్చామని కలెక్టర్ తెలిపారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. అంతకుముందు ఆసుపత్రి ప్రాంగణంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆమె ప్రారంభించారు. రోగులకు, వారి సహాయకులకు నాణ్యమైన, రుచికరమైన అల్పాహారం, భోజనం అందించాలని, క్యాంటీన్‌లో పరిశుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ క్యాంటీన్ ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి లభించడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు.

# ఇంటి వద్దకే మరణ ధృవీకరణ పత్రం అందజేత

సర్పంచ్ కనికిరెడ్డి సతీష్



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఓదెల మండల కేంద్రం తారకరామ కాలనీలో ఇటీవల కాలంలో తీగల అమృతమ్మ మరణించగా కుటుంబ సభ్యులకు ఇంటి వద్ద సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ పాలకవర్గంతో కలిసి మరణ ధృవీకరణ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మా కుటుంబం బాధలో ఉండగా సర్పంచ్ పాలకవర్గం కుటుంబ సభ్యులను పరామర్శించి వారే స్వయంగా ఇంటికి వచ్చి మరణ ధృవీకరణ పత్రం ఇవ్వడం చాలా సంతోషం ఈ కార్యక్రమంలో కార్యదర్శి వెంకట లక్ష్మణ్ వార్డ్ సభ్యులు అప్పన తిరుపతి, గొర్ల శ్రీనివాస్. రాజారాం పెండం ఓదెలు మృతుని కుమారుడు తీగల సదానందం, తీగల కుమార్ బంధువులు పాల్గొన్నారు.

# ఈ వి ఎం గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు




**పోరు తెలంగాణ, మంచిర్యాల అక్టోబర్ 6, 2026 :** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల ఈ వి ఎం గోదామును ఎన్నికల విభాగం అధికారులతో కలిసి సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము వద్ద పోలీసు సిబ్బంది సమన్వయంతో పటిష్టమైన బందోబస్తు చేపట్టడంతో పాటు 24 గంటలు సి.సి. కెమెరాల ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. భద్రత సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రచురణార్థం 3 భూ-భారతి రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూముల హద్దుల నిర్ధారణ, సమగ్ర భూ రికార్డుల రూపకల్పన




**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఇందుర్తి గ్రామంలో భూ-భారతి రీ-సర్వే అవగాహన సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భూ-భారతి రీ-సర్వే ద్వారా క్షేత్రస్థాయిలో ప్రతి భూమి హద్దులను ఖచ్చితంగా నిర్ధారించి, సమగ్ర భూ రికార్డులను రూపొందించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. రీ-సర్వే ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేలా రైతులు, ప్రజలు అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. మంగళవారం ఓదెల మండలం ఇందుర్తి గ్రామంలో నిర్వహించిన భూ-భారతి రీ-సర్వే అవగాహన సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని, రీ-సర్వే ఉద్దేశ్యం, చేపట్టనున్న ప్రక్రియ, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రాంతంలో చివరిసారిగా 1937లో భూ సర్వే జరిగిందని తెలిపారు. అనేక సంవత్సరాల అనంతరం ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామాల్లో సమగ్ర రీ-సర్వే నిర్వహించాలని నిర్ణయించిందన్నారు.

**భూముల హద్దులు, రికార్డులలో మార్పులతో సమస్యలు**

గతంలో ఒక సర్వే నంబర్‌లోని భూమి ఒకే వ్యక్తి వద్ద ఉండేదని, కాలక్రమేణా కొనుగోళ్లు, అమ్మకాలు, వారసత్వ బదలాయింపులు తదితర కారణాలతో భూములు అనేక చేతులు మారాయని తెలిపారు. పట్టాదారు పాస్‌పుస్తకాల్లో మార్పులు జరిగినప్పటికీ క్షేత్రస్థాయిలో ప్రతి భూమికి సంబంధించిన ఖచ్చితమైన మ్యాప్ అందుబాటులో లేకపోవడం వల్ల భూముల విస్తీర్ణంలో తేడాలు, హద్దులకు సంబంధించిన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు

**పెద్దపల్లి జిల్లాలో తొలి దశలో 70 గ్రామాల్లో రీ-సర్వే**

పెద్దపల్లి జిల్లాలో మొత్తం 190 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని, మొదటి దశలో 70 గ్రామాలను రీ-సర్వే కోసం ఎంపిక చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ గ్రామాల్లో ఇందుర్తి కూడా ఒకటని పేర్కొన్నారు. రీ-సర్వేలో భాగంగా ముందుగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, అనంతరం ఇళ్లు, ప్రభుత్వ ఆస్తులు, వ్యవసాయ భూములను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేస్తామని తెలిపారు. ఆధునిక సర్వే పరికరాల సహాయంతో భూముల హద్దులను ఖచ్చితంగా గుర్తించి సమగ్ర భూ రికార్డులను రూపొందిస్తామని వెల్లడించారు.

**సర్వే అనంతరం 21 రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ**

అభ్యంతరాల పరిష్కారం అనంతరం తుది భూ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూధార్ కార్డులను జారీ చేస్తామని తెలిపారు. భవిష్యత్‌లో భూములకు సంబంధించిన వివరాలు సులభంగా గుర్తించేందుకు, భూ హక్కులకు భద్రత కల్పించేందుకు ఈ ప్రక్రియ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.

**పైలెట్ ప్రాజెక్టులో 99 శాతం సమస్యల పరిష్కారం**

రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వే ద్వారా సుమారు 99 శాతం భూ సమస్యలను పరిష్కరించగలిగామని జిల్లా కలెక్టర్ తెలిపారు. భూముల విస్తీర్ణం, హద్దులు, ఇతర భూ సంబంధిత సమస్యలకు రీ-సర్వే ద్వారా శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు.

**రోజుకు 40 నుంచి 50 ఎకరాల వరకు సర్వే**

రీ-సర్వేలో భాగంగా రోజుకు సుమారు 40 నుంచి 50 ఎకరాల వరకు సర్వే నిర్వహించే అవకాశం ఉందని తెలిపారు. ఏ భూములను, ఏ సమయంలో సర్వే చేయనున్నారనే సమాచారాన్ని ముందుగానే సంబంధిత రైతులకు తెలియజేస్తామని చెప్పారు. సంబంధిత రైతులు నిర్దేశిత సమయంలో తమ భూముల వద్ద అందుబాటులో ఉండి సర్వే సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలని కోరారు

**రీ-సర్వే ద్వారా రూపొందించే భూ వివరాలు రాబోయే**

60 నుంచి 70 సంవత్సరాల వరకు ఉపయోగపడేలా పకడ్బందీగా రూపొందించనున్నట్లు తెలిపారు. ఆధార్ తరహాలో భూమికి ప్రత్యేక గుర్తింపుగా భూధార్ కార్డుల జారీకి ఈ రీ-సర్వే కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడేలా ఖచ్చితమైన భూ రికార్డులను రూపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. రీ-సర్వే సమయంలో అధికారులు, సర్వే సిబ్బందికి రైతులు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని, భూ వివరాలకు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా అభ్యంతరాలు ఉంటే నిర్దేశిత ప్రక్రియలో వాటిని తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వనజ నాయక్,సంబంధిత రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు ,తదితరులు పాల్గొన్నారు.

# 2028లో సిర్పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే పోటీలో బరిలో కావేటి సబిత మనోహర్

ప్రజల మన్ననలు పొందడమే లక్ష్యం...

ఎల్లవేళలా సిర్పూర్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటా....

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ప్రజాసేవకు అంకితం....

మౌలిక సదుపాయాలు, నిరుద్యోగ సమస్యలపై ప్రత్యేక దృష్టి....




**పోరు తెలంగాణ అక్టోబర్ 06: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిది :** సిర్పూర్ నియోజకవర్గంలో 2028 అసెంబ్లీ ఎన్నికల రాజకీయ వాతావరణం ఇప్పటి నుంచే ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన సమితి నుంచి 2028 అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు మాజీ శాసనసభ్యులు కావేటి సమ్మయ్య పెద్ద కోడలు కావేటి సబిత ప్రకటించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేయాలనే సంకల్పంతో రాజకీయాల్లో ముందుకు వస్తున్నట్లు ఆమె తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గ ప్రజల మన్ననలు పొందడం తన ప్రధాన లక్ష్యమని కావేటి సబిత పేర్కొన్నారు. రాజకీయాలు కేవలం పదవి కోసం కాకుండా ప్రజలకు సేవ చేసే వేదికగా ఉండాలని తాను భావిస్తున్నానని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలనే ఉద్దేశంతో ఉన్నట్లు ఆమె వెల్లడించారు.

**తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో రాజకీయ ప్రస్థానం**

తెలంగాణ ఉద్యమం మా ఇంట్లోనే ఉంది మా మామ కాబట్టి సమ్మయ్య తెలంగాణ ఉద్యమకారుడు తెలంగాణ రావడం కోసం పోరాడిన వ్యక్తి రెండుసార్లు సిర్పూర్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గ ప్రజలకు ఎంతో సేవ చేశారని అని కావేటి సబిత పేర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమ స్ఫూర్తి తమ కుటుంబంలో ఉందని, ప్రజల హక్కులు, ప్రాంత అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం పనిచేయాలనే ఆలోచన తనలో బలంగా ఉందని తెలిపారు. అదే స్ఫూర్తితో సిర్పూర్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు కష్టసమయంలో అండగా నిలబడే నాయకత్వం అవసరమని, ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తిగా తనను తాను నిరూపించుకోవాలని భావిస్తున్నట్లు ఆమె తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

**ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా**

సిర్పూర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి ప్రాంత ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా తన కార్యాచరణ ఉంటుందని కావేటి సబిత తెలిపారు. ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి నాయకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదని, ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తనను ఒక రాజకీయ నాయకురాలిగా మాత్రమే కాకుండా తమ సమస్యలను వినే వ్యక్తిగా భావించేలా పనిచేస్తానని తెలిపారు. నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడం, గ్రామాల్లోని సమస్యలను గుర్తించడం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తానని అన్నారు.

**మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం**

సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధిలో మౌలిక సదుపాయాలు కీలకమని కావేటి సబిత పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్, వీధి దీపాలు, విద్య, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయడం తన ప్రాధాన్య అంశాల్లో ఒకటని తెలిపారు. అభివృద్ధి అనేది పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు కూడా చేరాలని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం ఉండాలని ఆమె పేర్కొన్నారు.

**నిరుద్యోగ సమస్యపై ప్రత్యేక దృష్టి**

సిర్పూర్ నియోజకవర్గంలో యువతకు ఉపాధి అవకాశాలు పెరగాల్సిన అవసరం ఉందని కావేటి సబిత అన్నారు. చదువుకున్న యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి తగ్గించేందుకు స్థానికంగా ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, ఉద్యోగ సమాచారం వంటి అంశాల్లో యువతకు సహకారం అందించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. యువత తమ సామర్థ్యాలను వినియోగించుకుని ముందుకు వెళ్లేందుకు అవసరమైన అవకాశాలు కల్పించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని అన్నారు.

**ప్రజలే బలం.. ప్రజలే మార్గదర్శకులు**

సిర్పూర్ నియోజకవర్గ ప్రజలే తనకు ప్రధాన బలమని కావేటి సబిత పేర్కొన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను తెలుసుకుని వాటికి అనుగుణంగా పనిచేయడమే తన రాజకీయ లక్ష్యమని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వెళ్లే విధానం కాకుండా, నిరంతరం ప్రజల మధ్య ఉండే రాజకీయ సంస్కృతిని తీసుకురావాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రజల సమస్యలను వినడం, వాటిపై స్పందించడం, సాధ్యమైన పరిష్కారాలను చూపించడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి వర్గానికి సమాన ప్రాధాన్యం ఇస్తూ, ఎలాంటి వివక్ష లేకుండా ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

**అభివృద్ధి, ఉపాధి, ప్రజాసేవే ప్రధాన ఎజెండా**

సిర్పూర్ నియోజకవర్గంలో అభివృద్ధి, యువతకు ఉపాధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం వంటి అంశాలను ప్రధానంగా తీసుకుని ముందుకు సాగనున్నట్లు కావేటి సబిత తెలిపారు. ప్రజల సమస్యలను రాజకీయ కోణంలో కాకుండా మానవతా దృక్పథంతో చూడాల్సిన అవసరం ఉందన్నారు. 2028 ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన సమితి తరఫున సిర్పూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలనే తన నిర్ణయం వెనుక ప్రజాసేవ చేయాలనే ఆకాంక్ష ఉందని ఆమె స్పష్టం చేశారు. ప్రజలు తనను ఆశీర్వదించి అవకాశం ఇస్తే నియోజకవర్గ అభివృద్ధికి తన శక్తి మేరకు కృషి చేస్తానని తెలిపారు.

**పదవి కోసం కాదు.. ప్రజల కోసం పనిచేయాలనేదే నా లక్ష్యం**

సిర్పూర్ ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పనిచేస్తానని కావేటి సబిత అన్నారు. ప్రజల నమ్మకాన్ని సంపాదించుకోవడం, వారి మన్ననలు పొందడం, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండడం తన రాజకీయ ప్రయాణంలో ముఖ్యమైన అంశాలని పేర్కొన్నారు. మా మామ కావేటి సమ్మయ్య ఆశయ సాధన తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి తో ప్రజల కోసం పనిచేయాలనే భావంతో ముందుకు వస్తున్నాను. సిర్పూర్ నియోజకవర్గ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని కోరుకుంటున్నాను. 2028లో తెలంగాణ రక్షణ సేన సమితి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తాను. ప్రజల ఆశీర్వాదం, మద్దతుతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాను" అని కావేటి సబిత పేర్కొన్నారు. సిర్పూర్ నియోజకవర్గ రాజకీయాల్లో 2028 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే నాయకులు, ఆశావహులు తమ కార్యాచరణను ప్రారంభిస్తున్న నేపథ్యంలో కావేటి సబిత ప్రకటన కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాబోయే రోజుల్లో ఆమె చేపట్టే ప్రజా కార్యక్రమాలు, గ్రామాల పర్యటనలు, యువతతో సమావేశాలు, స్థానిక సమస్యలపై స్పందన వంటి అంశాలు ఆమె రాజకీయ ప్రస్థానానికి కీలకంగా మారనున్నాయి.

# దసరా నాటికి రెండు పడకగదుల ఇండ్ల అప్పగింతకు చర్యలు

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య




**పోరు తెలంగాణ మంచిర్యాల,అక్టోబర్ 6, 2026 :** జిల్లాలోని రెండు పడక గదుల ఇండ్ల సముదాయాలను ఈ దసరా నాటికి లబ్ధిదారులకు అప్పగించేలా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, క్యాతన్‌పల్లి, మందమర్రి మున్సిపాలిటీల పరిధిలోని రెండు పడక గదుల ఇండ్ల గృహ సముదాయాలను గృహ నిర్మాణ శాఖ పి.డి., డి.ఈ., ఎ.ఈ. లతో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించి గృహ సముదాయాలలో పెండింగ్ పనులు, త్రాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దసరా నాటికి రెండు పడక గదుల ఇండ్లను లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి, లబ్ధిదారులకు గృహాల అప్పగింతకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు?? దసరా నాటికి గృహ సముదాయాలను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, తహసిల్దార్, క్యాతన్‌పల్లిలో మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ తహసీల్దార్, మందమర్రిలో మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# భీమారం మండల కేంద్రంలో ఘనంగా

# 9వ జాతీయ పోషణ్ మాసం కార్యక్రమం

**పోరు తెలంగాణ మంచిర్యాల అక్టోబర్ 6 :** మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భీమారం మండలంలో మంగళవారం 9వ జాతీయ పోషణ్ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భీమారం సెక్టార్ సూపర్వైజర్ సుప్రిత, అంగన్‌వాడీ టీచర్ల సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, తల్లులు, చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్యం మరియు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల పౌష్టికాహార పదార్థాల ప్రదర్శన ఏర్పాటు చేసి, స్థానికంగా లభించే చిరుధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు తదితర పోషక పదార్థాల ప్రాధాన్యతను వివరించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాశన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ మాట్లాడుతూ, బాలల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో ముఖ్యమని, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన పోషకాహారం అందేలా కుటుంబ సభ్యులు శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సీడీపీఓ సంకీర్తన మాట్లాడుతూ, పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల్య ఆహారం అవసరమని, తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం మరియు ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. డీటీ అంజమ్మ మాట్లాడుతూ, గర్భధారణ దశ నుంచే తల్లి, శిశువు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమని, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. మండల కాంగ్రెస్



అధ్యక్షులు పొడేటి రవి మాట్లాడుతూ, ప్రజల్లో పోషకాహారంపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. భీమారం సెక్టార్ సూపర్వైజర్ సుప్రిత మాట్లాడుతూ, శిశువు మొదటి 1000 రోజులు ఆరోగ్యకరమైన జీవితానికి ఎంతో కీలకమైనవని, ఈ దశలో సరైన పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ మరియు పరిశుభ్రతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, సీడీపీఓ సంకీర్తన , డీటీ అంజమ్మ, భీమారం సెక్టార్ సూపర్వైజర్ సుప్రిత, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పొడేటి రవి , కాంగ్రెస్ నాయకులు



ఉప్పుమల్ల శ్రీనివాస్ , ఉప సర్పంచ్ కోలే సత్తెమ్మ , వార్డు సభ్యులు బోగే సునీత , సుంకరి ప్రకాష్ , పోషణ్ అభియాన్ డీసీ రజిత , విమెన్ హబ్ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు,సహాయకులు, తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో పైకప్పు పెచ్చులు ఊడి ఐదుగురికి గాయాలు



**పోరు తెలంగాణ అక్టోబర్ 06: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అంకుశాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పైకప్పు పెచ్చులు ఒక్కసారిగా ఊడిపడటంతో ఐదుగురు గాయపడ్డారు. వీరిలో ముగ్గురు చిన్నారులు, ఇద్దరు తల్లులు ఉన్నారు. ప్రమాదంలో సంగీత, సోనీ అనే ఇద్దరు మహిళలతో పాటు హరిత, స్వాతిక, సాయి అనే ముగ్గురు చిన్నారులు గాయపడ్డారు. నలుగురికి తలపై స్వల్ప గాయాలు కావడంతో సమీపంలోని ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. సంగీతకు తలకు తీవ్ర గాయం కావడంతో ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది.

**చిన్నారుల భద్రతపై ఆందోళన**

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు నిత్యం ఉంటారు. ఇలాంటి కేంద్రాల భవనాల భద్రతపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. గతంలోనూ జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, మౌలిక సదుపాయాలపై అధికారులు తనిఖీలు నిర్వహించిన



సందర్భాలున్నాయి. అంకుశాపూర్ ఘటన నేపథ్యంలో జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల భవనాల స్థితిగతులను అధికారులు మరోసారి పరిశీలించి, శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. పిల్లలు, తల్లుల ప్రాణాలకు ముప్పు కలిగే పరిస్థితులు పునరావృతం కాకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు.



# గాయపడిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలి

తెలిగూడ అంగన్వాడీ ప్రమాద బాధితులకు పరామర్శ.....

కలెక్టర్ కె. హరిత.....

**పోరు తెలంగాణ అక్టోబర్ 06: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** ఆసిఫాబాద్ మండలం అంకుశాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని తెలిగూడ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం స్లాబ్ పెచ్చులు ఊడిపడ్డాయి. ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు, వారి తల్లులు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ కె. హరిత వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు.చికిత్స పొందుతున్న చిన్నారులు, తల్లులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గాయాల తీవ్రత, అందుతున్న చికిత్స, వైద్య పరీక్షలు, మందుల లభ్యతపై వైద్యులతో మాట్లాడారు. అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించి, మెరుగైన చికిత్స



అందించాలని, చికిత్సలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఆదేశించారు.ప్రస్తుతం బాధితులు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని, ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు.అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, భవనాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చిన్నారులు చదువుకునే, భోజనం చేసే, విశ్రాంతి తీసుకునే ప్రాంతాల్లో ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదానికి దారితీసిన కారణాలపై వివరాలు సేకరించి, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు కిరణ్, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## 36 శాతానికి పైగా లాభాల బోనస్ వెంటనే చెల్లించాలి

# మణుగూరు జీఎం ఆఫీస్ ఎదుట టీబీజీకేఎస్ భారీ ధర్నా!




వాస్తవ లాభాలను దాచకుండా పారదర్శకంగా ప్రకటించాలి: ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు

సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్‌కు వినతిపత్రం అందజేత

**భద్రాద్రి కొత్తగూడెం, పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గం (ప్రతినిధి-వల్లెపోగు రాము) మణుగూరు, అక్టోబర్ 6 :-** పాతాళ గర్భంలో ప్రాణాలను పణంగా పెట్టి రేయింబవళ్లు శ్రమిస్తున్న సింగరేణి కార్మికులకు 2025--26 ఆర్థిక సంవత్సరపు వాస్తవ లాభాల నుంచి 36 శాతానికి పైగా లాభాల బోనస్‌ను తక్షణమే ప్రకటించి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కదం తొక్కింది. మంగళవారం సాయంత్రం మణుగూరు ఏరియా జీఎం కార్యాలయం ప్రాంగణంలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులు భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు నేతృత్వంలో నిర్వహించిన ఈ నిరసనలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం, యాజమాన్య వైఖరికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. అనంతరం ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్‌ను కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ?ఈ సందర్భంగా ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ.. సంస్థ సాధించిన లాభాల లెక్కల్లో పారదర్శకత లోపించిందని ఆందోళన వ్యక్తం చేశారు. 2025--26 ఆర్థిక సంవత్సరంలో కార్మికుల చెమటోడ్చి సాధించిన వాస్తవ నికర లాభాలను ఎలాంటి కోతలు, తగ్గింపులు, అభివృద్ధి నిధుల మినహాయింపులు లేకుండా కార్మికుల ముందు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. సాధించిన వాస్తవ లాభాల ఆధారంగా 36 శాతానికి పైగా వాటాను ఏకమొత్తంగా ప్రకటించి, కార్మికుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో వెంటనే జమ చేయాలన్నారు. ఎండనక, వాననక ప్రాణాలకు తెగించి బొగ్గును వెలికితీసే కార్మికుల శ్రమకు న్యాయమైన వాటా చెల్లించాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం



మరియు సింగరేణి యాజమాన్యంపై ఉందని గుర్తుచేశారు. ?టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి దిశానిర్దేశం మేరకు కార్మికుల హక్కుల సాధన కోసం మణుగూరు డివిజన్ వ్యాప్తంగా ఈ ఆందోళన చేపట్టినట్లు నాగెల్లి వివరించారు. కార్మికుల డిమాండ్లను నిర్లక్ష్యం చేస్తే పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. ?ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు బంగారి పవన్ కుమార్, జంగం రాజ్ కుమార్, బొద్దుల ప్రవీణ్ కుమార్, మస్తాన్, దిశెట్టి రమేష్, చిరుత వెంకటేశ్వర్లు, బడే హరీష్, సర్వే నరేష్, అజ్మీరా అశోక్, ఇమ్రాన్, కటారి ప్రసాద్, తన్నీరు లింగయ్య, ఉప్పులేటి మురళి, హనీఫ్, సర్వేశ్, శ్రీను, నాగేశ్వరరావు, రాజేందర్, తిరుపతి, యోగి, శివ ప్రసన్న, బంగారి సురేష్, తోట తిరుపతి, మెదరి మహేష్, ఆపరేటర్ రమేష్, అరుణ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బూరుగుపల్లి గ్రామంలో వరి, ప్రత్తి పంటల సంరక్షణ చర్యలు





**పోరు తెలంగాణ మంచిర్యాల అక్టోబర్ 6 :** భీమారం మండలం బూరుగుపల్లి గ్రామంలో వరి, ప్రత్తి పంటలలో ఆశిస్తున్న పురుగులు, తెగుళ్ల నివారణకు భీమారం మండల వ్యవసాయ అధికారీ అత్తే సుధాకర్ క్రింది సమగ్ర యాజమాన్య పద్ధతులను సూచించారు. వరి పంటను ఆశిస్తున్న కాండం తొలిచే పురుగు, ఆకుమడత పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరెడ్ 50 శాతం డబ్ల్యూ పి పౌడర్ 2 గ్రామ్ /లీటర్ లేదా క్లోరోతింప్రోల్ 60 ఎంల్ లేదా టెట్రానిలిప్రోలు 100 ఎంల్ ఎకరానికి 200 లీటర్లు నీటిలో కలిపి పిచికారి చేసుకున్నట్టయితే వాటి నివారించవచ్చునని తెలిపారు. అంతేకాకుండా వరిలో సుడిదోమ ఉధృతిని కూడా ఉందని . దాని నివారణకు (పేక్సలాన్ )ట్రైఫ్లూమేజోఫైరిమ్ 94.4 గ్రామ్ లేదా డైనోటిఫూరాన్ 100 గ్రామ్ లేదా పైమెట్రోజైన్ 50 శాతం డబ్ల్యూ పి 120 గ్రామ్ లేదా (పైమెట్రోజైన్ 45 శాతం ం డైనోటిఫూరాన్ 15 శాతం డబ్ల్యు జి ) 133 గ్రామ్స్ ఎకరానికి పొలంలో నీళ్లు తీసివేసి తూర్పు పడమరగా పాయలు తీసి మొదళ్ల పైన పడేవిధంగా పొద్దున సమయంలో గానీ లేదా సాయంత్ర సమయంలో పిచికారి చేసినట్లయితే మంచి ఫలితం ఉంటుంది అని తెలిపాడు. ప్రత్తి పంటను ఆశిస్తున్న తెల్లదోమ, పచ్చ దోమ మరియు రసం పిలిచే పురుగుల నివారణకు నైటెంపిరం 25 శాతం డబ్ల్యూ పి 120 గ్రామ్స్ ఎకరానికి లేదా టాలైఫెనపీరాడ్ 15 శాతం ఈసీ 200 ఎంల్ లేదా (డైఫ్ఎంతురాన్48 శాతం ం డైనోటె్ పూరాన్ 8 శాతం )ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి అని సూచించారు.

# తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు





**పోరు తెలంగాణ మంచిర్యాల అక్టోబర్ 6 :** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కల్వరి యువశక్తి అనాధ ఆశ్రమంలో 30 మంది అనాధ వృద్ధుల మధ్య మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తి దారుణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ వృద్ధులకు అన్నదానము, మరియు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైనమిక్ సీనియర్ లీడర్ యాదవ ముద్దుబిడ్డ అన్న అంటే నేనున్న అంటూ ఆపదలో ఆదుకునే ఆపద్బాంధవుడు మాజీ మంత్రి వర్యులు సన్నత్ నగర్ నియోజకవర్గం శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు గత 8 సంవత్సరాలనుండి మంచిర్యాల జిల్లాలో గ్రాండ్ గా సంబరాలు చేస్తూ అనాధ పిల్లలకి నోట్ బుక్స్ పెన్,వాటర్ బాటిల్లు మహిళలకు చీరల పంపిణి బ్లాకెట్స్ ఇలా అనేక కార్యక్రమలు చేస్తూన్న తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం చేస్తుంది ఈ కార్యక్రమం లో చెన్నూర్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మెండే మల్లేష్ యాదవ్,పంభాల ఎర్రన్న యాదవ్ భీమారం మండలం ప్రధాన కార్యదర్శి కేశవేణి సత్యనారాయణ యాదవ్ కల్వరి యువ షేక్తి డైరెక్టర్ కుమార్ జంగపెల్లి శ్రీధర్ పూసల రమేష్ మల్లేష్ యాదవ్ లు పాల్గొన్నారు

# విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకి బర్రె మృతి

రూ.లక్ష నష్టం రైతు ఆవేదన..



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి దోమకొండ, అక్టోబర్ 6:(పోరు తెలంగాణ న్యూస్:) :** కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం ముత్యంపేట్ గ్రామానికి చెందిన చింపాల సత్తయ్యకు చెందిన బర్రె విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. మంగళవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో ప్రమాదం జరిగినట్లు రైతు తెలిపారు. మృతిచెందిన బర్రె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని పేర్కొన్నారు. బర్రె మృతితో నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని సత్తయ్య కోరారు.

# మున్సిపల్ కార్మికుల వేతనాల చెల్లింపులో ప్రతి నెల లక్షల రూపాయల స్కాం. బిజెపి మున్సిపల్ కౌన్సిలర్లు మీడియా సమావేశం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి : అక్టోబర్ 6.(పోరు తెలంగాణ న్యూస్:) :** కామారెడ్డి పట్టణంలోని మున్సిపల్ పరిధిలో పని చేసే పారిశుధ్య కార్మికులకు చెల్లించే వేతనాలు అవకతవకలపై బీజేపీ మున్సిపల్ కౌన్సిలర్ లు బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మోటూరీ శ్రీకాంత్ మాట్లాడుతూ పట్టణములో నూతన పాలక వర్గం ఏర్పాటు అయిన నాటి నుండి అభివృద్ధి మాట తరువాత కనీసం వార్డుల్లో పారిశుధ్య సమస్య తీర్చాలని గత 8నెలలుగా అన్ని పార్టీల కౌన్సిలర్ లు సర్వ సభ్య సమావేశాలలో విన్నవించుకున్న ఎలాంటి పురోగతి లేదని గత వారం ఉదయం హాజరు సమయంలో బీజేపీ కౌన్సిలర్ల బృందం ఉదయం వెళ్లగా అక్కడ పని చేసే సిబ్బందికి, హాజరు పట్టికలో వేసిన హాజరుకి సంబంధం లేదని , జీతాల చెల్లింపులో కూడా అవకతవకలు జరుగుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పారిశుధ్య కార్మికుల వేతనాలు చెల్లించే 35 గ్రూపులకు చెల్లించిన వేతనాల విషయంలో అనుమానంతో నేడు ఉదయం కార్మికులను వివరాలు అడిగి తెలుసుకోవడం జరిగిందని. మున్సిపల్ నుండి గ్రూపులకు చెల్లించిన వేతనానికి కార్మికులకు చెల్లించిన వేతనానికి చాలా తేడా ఉన్నదని అన్నారు. వేతనాలు చెల్లించే గ్రూపులో లేని వారికి చెక్ పవర్ ఉండటం, చెక్ పవర్ ఉన్న వారు చేతి వాటం చూపడం, వేతనాలు చెల్లించేటప్పుడు కోతలు విధించడం అనేక అనుమానాలకు తావిస్తుందని అన్నారు. పూర్తి స్థాయి శానిటేషన్ ఇన్స్పెక్టర్ లేకపోవడం వల్ల ఇంచార్జీల కారణంగా డబ్బులు అవకతవకలు జరుగుతున్నాయని, వాటర్ వర్క్స్ విభాగం, ఎలక్ట్రిసిటీ ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది విత్తనాల విషయంలో కూడా అనేక అనుమానాలు ఉన్నాయని అన్నింటి విషయంలో విచారణ చేపట్టాలని కలెక్టర్, ఏమ్మెల్యే కి విజ్ఞప్తి చేస్తామని అన్నారు నిజాలు నిగ్గు తేలాల్సిన అవసరం ఉందని ప్రతి నెల లక్షల రూపాయలు దారి మళ్లుతున్నాయని, ప్రజా ధనం దుర్వినియోగం అయితే బీజేపీ చూస్తూ ఊరుకోదని అన్నారు.

# నేత్రదాత తీగల అమృతమ్మ సంస్మరణ సభ



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి** : పెద్దపల్లి జిల్లా అక్టోబర్ 6 మంగళవారం ఓదెల మండల కేంద్రం తారకరామా కాలనీలో కుటుంబ సభ్యులు సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ మేరుగు భీష్మాచారి ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించి వచ్చిన బంధు మిత్రులకు నేత్ర అవయవ శరీర దానాలపై అవగాహన కల్పించారు ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన కుటుంబ సభ్యులు.. సదానందం. కొమురెల్లి, కోడండ్లు కొమరమ్మ, శ్యామల, స్వరూప లకు డాక్టర్ భీష్మాచారి జ్ఞాపికను అందజేసి అభినందనలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాతం మల్లేశం, మేరుగు సారంగం, డాక్టర్ ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు పాల్గొని నేత్రదాతకు శ్రద్ధాంజలి ఘటించి కుటుంబానికి అభినందనలు తెలిపారు.

# జైపూర్ లో వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు






**పోరు తెలంగాణ, మంచిర్యాల అక్టోబర్ 6** : వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, జైపూర్ విద్యార్థులను అటవీ శాఖ ఆధ్వర్యంలో వానదర్శినికి తీసుకెళ్లినారు. ఈ కార్యక్రమంలో భాగంగా బర్డ్ వాచింగ్ ప్రోగ్రాం ప్రత్యేక ఆకర్షణ గా నిలిచింది... ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణ మరియు జీవవైవిధ్యానికి సంబంధించిన వివిధ అంశాలను నేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీ రామకృష్ణ సర్కార్ , బీట్ ఆఫీసర్లు వసంతలక్ష్మి,కే.రమేష్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం అధ్యాపకురాలు సౌదర్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ టీచర్లు ఆయాల వేతనాల పెంపుకు కృషి

ఎమ్మెల్యే హరీష్ బాబు....

రాస్పల్లిలో పోషణ మాసం, అంగన్ మిలన్ కార్యక్రమం....





**పోరు తెలంగాణ అక్టోబర్ 06: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కాగజ్‌నగర్ మండలంలోని రాస్పల్లి గ్రామంలో మంగళవారం పోషణ మాసం, అంగన్ మిలన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు పాల్గొని, అంగన్వాడీ టీచర్లు, ఆయాలను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తక్కువ వేతనాలతోనే అంగన్వాడీ టీచర్లు, ఆయాలు గొప్ప సేవ అందిస్తున్నారని ప్రశంసించారు. వారి వేతనాల పెంపు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికలకు పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. ఈ సౌకర్యాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అంగన్వాడీ పిల్లలతో కలిసి అల్పాహారం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ బోదాసు మాధవి, డీడబ్ల్యూఓ స్వరూప, సీడీపీఓ రెబెకా, సూపర్వైజర్లు చందన, మాధవి, సర్పంచులు కుందరపు సుమన్, కోట వేణు, నాయకులు పుల్ల అశోక్, దోతుల శ్రీనివాస్, బాపురావు, పెరుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలు పరిష్కరించాలి



**పోరు తెలంగాణ నెక్కొండ అక్టోబర్ 6** : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ నర్సంపేట ఆర్డీవోకు ఎం ఆర్ పి ఎస్ టి ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి ఈదునూరి యాకయ్య, జిల్లా అధ్యక్షుడు వడ్డూరి కుమార్ వినతిపత్రం అందజేశారు. నెక్కొండ పిఏసిఎస్ కార్యాలయంలో ఆర్డీవోను కలిసి రైతుల సమస్యలను వివరించారు. గన్నీ సంచులకు సంబంధించి రైతులకు రావాల్సిన నగదు చెల్లించకపోవడం, మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన మక్కల రవాణా ఖర్చులు రైతులకు అందకపోవడంపై వారు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు చెల్లింపులు జరగాల్సిన వివరాలను గ్రామ పంచాయతీ, మార్కెట్ కార్యాలయం, PACS కార్యాలయ నోటీస్ బోర్డులతో పాటు రైతు వేదికల వద్ద కూడా ప్రదర్శించాలని కోరారు. రైతుల సమస్యలను సానుకూలంగా విన్న ఆర్డీవో, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుని రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

# నిర్వాహకులు స్మార్ట్ అసెస్మెంట్ పోర్టల్ పై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు





**పోరు తెలంగాణ మంచిర్యాల,అక్టోబర్ 6, 2026 :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు స్మార్ట్ అసెస్మెంట్ పోర్టల్ (PCSAP) పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల జిల్లా పౌర సరఫరాల అధికారి వేణుగోపాల్, ఆసిఫాబాద్ జిల్లా పౌరసరఫరాల అధికారి వాజిద్ , ఆసిఫాబాద్ పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రజిత, జిల్లా సహకార అధికారి కరుణాకర్,ఎఫ్.సి.ఐ. అధికారి సుఖీష్ , సంబంధిత అధికారులతో కలిసి యాప్ వినియోగం, ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ఎఫ్.సి.ఐ. అధికారులతో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, నిర్ణీత మద్దతు ధరకు రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను కొంత ఎత్తైన, చదును ప్రదేశాలలో ఏర్పాటు చేయాలని, గోనె సంచులను భద్రపరిచేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, మరుగుదొడ్లు, విద్యుత్, టేబుళ్లు, కుర్చీలు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు తదితర సౌకర్యాలను తప్పనిసరిగా కల్పించాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో 2 ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, 30 టార్పాలిన్లు, 1 ప్యాడీ క్లీనర్ అందుబాటులో ఉంచాలని, ప్యాడీ క్లీనర్ అందుబాటులో లేని చోట ట్రాక్టర్ మౌంటెడ్ ఫ్యాన్ ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతుల నుంచి వరుస క్రమంలో ధాన్యం కొనుగోలు చేయాలని, రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని తీసుకు వచ్చినప్పుడు తేమ శాతం 17 శాతానికి మించి ఉంటే, ధాన్యాన్ని ఆరబెట్టుకొని తేమ శాతం తగ్గిన తర్వాత తీసుకువచ్చే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ధాన్యం విక్రయానికి వచ్చే రైతుల నుంచి ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, పట్టాదారు పాస్‌బుక్ నకలు ప్రతులను తీసుకోవాలని, ప్రభుత్వం ప్రకటించిన 7 రకాల ధాన్యానికి మాత్రమే బోనస్ వర్తిస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసే ముందు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు పి.సి.ఎస్.ఎ.పి. యాప్‌లోని 16 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను ట్యాబ్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, ధాన్యానికి సంబంధించిన ఖచ్చితమైన ఫోటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లాలో విజయవంతంగా అమలు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాలను వేగవంతం చేయాలి



జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య,



**పోరు తెలంగాణ మంచిర్యాల,అక్టోబర్ 6, 2026 :** జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాలను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, హౌసింగ్ కార్పొరేషన్ పిడి బన్సీలాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్ అధికారి రవీందర్, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ తిరుపతి, ఎ.పి.డి. మోహన్ లతో కలిసి వి బి జి రామ్ జి, ఇందిరమ్మ ఇళ్లు, ఇంకుడు గుంతలు, పారిశుధ్యం, బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్లు, ఇంటి పన్నుల వసూళ్లు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వి బి జి రామ్ జి పథకం క్రింద జిల్లాలో అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ, వి.ఓ., అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా నిర్మాణం పూర్తైన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఐ.హెచ్.హెచ్.ఎల్. చెల్లింపులు పూర్తయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాకు మంజూరైన 5.50 కోట్ల రూపాయల నిధులను మెటీరియల్ కాంపోనెంట్ క్రింద వినియోగించి, సంబంధిత భవనాల నిర్మాణ వ్యయాన్ని నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 2 బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, జిల్లాలో ఇప్పటికే మంజూరైన 3 వేల 150 ఇంకుడు గుంతలకు మార్కింగ్ పూర్తి చేసి పనులను ప్రారంభించాలని, మిగిలిన ఇంకుడు గుంతలకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలలో ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, పండుగలు నిర్వహించే ప్రాంతాలలో ముళ్ల పొదలు, చెట్లు తదితర అవరోధాలు ఉంటే సంబంధిత మండల పంచాయతీ అధికారులు వాటిని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, ఏపీవోలు, హౌసింగ్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలి

రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

కళాశాలల్లో 'నషా ముక్త్ భారత్' అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి.

సింగరేణి ప్రాంతాల్లోనూ మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించాలి.

డ్రగ్స్ ప్రభావానికి గురైన వారికి తక్షణమే డీ-అడిక్షన్ చికిత్స అందేలా చర్యలు.





**పోరు తెలంగాణ, అక్టోబర్ 6 :** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు యువత ఎట్టి పరిస్థితుల్లోనూ ఆకర్షితులు కావొద్దని, మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మంగళవారం ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లి గ్రామంలోని మహేశ్వర ఫంక్షన్ హాల్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మిషన్ పరివర్తన' మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ రామ్ రెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీస్ శాఖ చేపట్టిన 'మిషన్ పరివర్తన' కార్యక్రమాన్ని అభినందించారు. యువత భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై నిరంతరం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

**కళాశాలల్లో 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాలు**

ఇంజినీరింగ్,డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేలా 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. కేవలం సరదా లేదా థ్రిల్ కోసం కూడా మాదకద్రవ్యాలను ప్రయత్నించవద్దని యువతకు సూచించారు. డ్రగ్స్‌కు బానిసలైతే విద్య,కెరీర్‌తో పాటు భవిష్యత్ కూడా దెబ్బతింటుందని తెలిపారు. సింగరేణి ప్రాంతాల్లోనూ మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసులు,ప్రజలు సమష్టిగా కృషి చేస్తేనే మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని అన్నారు.

**డ్రగ్స్ ప్రభావితులకు తక్షణమే డీ-అడిక్షన్ చికిత్స**

ఎవరైనా డ్రగ్స్ లేదా గంజాయి ప్రభావానికి గురైనట్లు గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని మంత్రి కోరారు. సమాచారం అందిన వెంటనే అవసరమైన డీ-అడిక్షన్ చికిత్స అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.

**మాదకద్రవ్యాల నిర్మూలనకు సమన్వయంతో చర్యలు**

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ 'మిషన్ పరివర్తన' వంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి యువతలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డీసీపీ రామ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల విక్రయాలు, గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. యువత తమ విలువైన సమయాన్ని, భవిష్యత్‌ను డ్రగ్స్ కారణంగా నాశనం చేసుకోవద్దని సూచించారు. క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ తమ ప్రతిభను పెంపొందించుకోవాలని కోరారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో యువత,ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని డీసీపీ పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి, జిల్లా కలెక్టర్,డీసీపీ, పోలీస్ అధికారులు, సిబ్బంది,యువత, ప్రజలు కలిసి మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, ఇతరులను కూడా వాటికి దూరంగా ఉండేలా చైతన్యపరుస్తామని ప్రతిజ్ఞ చేశారు. మాదకద్రవ్యాల అక్రమ వినియోగం, విక్రయాలు, రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేస్తామని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్,ఏసీపీ కృష్ణ,పోలీస్ అధికారులు, సిబ్బంది,యువత, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నివారణలో యువత పాత్రపై వ్యాసరచన పోటీ

తెలంగాణ యూనివర్సిటీ, సౌత్ క్యాంపస్





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి:అక్టోబర్ 6(పోరు తెలంగాణ న్యూస్:) :** హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడం, యువతలో బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించడం, హెచ్‌ఐవీ వ్యాప్తి నివారణలో యువత పాత్రను వివరించడం లక్ష్యంగా "హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నివారణలో యువత పాత్ర"అనే అంశంపై వ్యాసరచన పోటీని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లోని సామాజిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ విభాగం (ణూ్రాజఖ డి ఏ పి సి యు ), కామారెడ్డి జిల్లా సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సౌత్ క్యాంపస్ వైస్ ప్రిన్సిపాల్ డా. రాజేశ్వరి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అలాగే సామాజిక శాస్త్ర విభాగాధిపతి డా. అంజయ్య , భౌతిక శాస్త్ర విభాగాధిపతి డా. మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. రాజేశ్వరి వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నివారణలో విద్యార్థులు మరియు యువత పాత్ర అత్యంత కీలకమని అన్నారు. యువత సమాజంలో మార్పుకు ప్రధాన శక్తిగా నిలుస్తుందని, సరైన అవగాహన, శాస్త్రీయ దృక్పథం మరియు బాధ్యతాయుతమైన ప్రవర్తన ద్వారా హెచ్‌ఐవీ వ్యాప్తిని అరికట్టడంలో వారు ముఖ్యమైన పాత్ర పోషించగలరని తెలిపారు. హెచ్‌ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష, అపోహలు మరియు సామాజిక ముద్ర (స్టిగ్మా) తొలగించడానికి యువత ముందుకు రావాలని సూచించారు. డా. అంజయ్య , విభాగాధిపతి, డిప్ట్.అఫ్ సోషల్ వర్క్ మాట్లాడుతూ, హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నివారణ కేవలం వైద్య రంగానికి సంబంధించిన అంశం మాత్రమే కాదని, ఇది సామాజిక బాధ్యతతో కూడిన అంశమని పేర్కొన్నారు. ముఖ్యంగా యువతలో ఆరోగ్య అవగాహన, జీవన నైపుణ్యాలు, సురక్షితమైన ప్రవర్తన, సరైన సమాచారం మరియు బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. యువత తమ సహచరులు, కుటుంబ సభ్యులు మరియు సమాజంలోని ఇతర వర్గాలకు హెచ్‌ఐవీ వ్యాప్తి మార్గాలు, నివారణ పద్ధతులు, పరీక్షలు మరియు చికిత్సకు సంబంధించిన సరైన సమాచారాన్ని అందించడం ద్వారా "అవగాహన కల్పించే దూతలు"గా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. హెచ్‌ఐవీతో జీవిస్తున్న వ్యక్తులను వివక్షకు గురిచేయకుండా గౌరవం, మానవత్వం మరియు సమానత్వంతో చూడాలని అన్నారు. డా. మోహన్ బాబు, విభాగాధిపతి, భౌతిక శాస్త్ర విభాగం మాట్లాడుతూ, విద్యార్థులు ఇటువంటి అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం అభినందనీయమని అన్నారు. శాస్త్రీయ ఆధారాలపై ఆధారపడిన సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా అపోహలను తొలగించవచ్చని తెలిపారు. ఈ వ్యాసరచన పోటీలో సౌత్ క్యాంపస్‌లోని వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. "హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నివారణలో యువత పాత్ర" అనే అంశంపై విద్యార్థులు తమ ఆలోచనలు, అవగాహన మరియు సామాజిక బాధ్యతను వ్యాసాల ద్వారా వ్యక్తపరిచారు పోటీలో విజేతలకు మొదటి బహుమతి 1,000/-, రెండవ బహుమతి 500/-, మూడవ బహుమతి 250/-నగదు బహుమతులను అందజేయనున్నారు.

